సాక్షి
కామారెడ్డి
గురువారం ❘ 5 ❘ డిసెంబర్ ❘ 2024



పకడ్బందీగా నిర్వహించాలి
సీఎం కప్ టోర్నీని పకడ్బందీగా నిర్వహించాలని ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్ అధికారులకు సూచించారు.
- 8లో ▸



ఏడాదిలో రూ.830 కోట్లు..
ఏడాదిలో రూ.830 కోట్ల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించామని ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు తెలిపారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
35.0 /19.6

వాతావరణం
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. చలి తీవ్రత తక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

8న మాస్టర్స్ అథ్లెటిక్స్ జిల్లా స్థాయి ఎంపికలు

కామారెడ్డి అర్బన్: జిల్లాకేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఈనెల 8న మాస్టర్స్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రంజిత్‌మోహన్, డి.నరేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30 ఏళ్లనుంచి 80 ఏళ్లలోపు మహిళలు, పురుషులకు 100, 200, 400, 800 మీటర్ల పరుగు, 5 వేలు, 10 వేల మీటర్ల నడక, హై జంప్, లాంగ్ జంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్‌త్రో అంశాల్లో పోటీలుంటాయని పేర్కొన్నారు. ఈ పోటీలలో ప్రథమ, ద్వితీయ స్థానాలలో నిలిచేవారు వచ్చేనెలలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని తెలిపారు. ఆసక్తిగలవారు 8న ఉదయం 7 గంటలకు ఇందిరా గాంధీ స్టేడియానికి రావాలని సూచించారు.

నేడు బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ రాక

కామారెడ్డి అర్బన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై అభిప్రాయాలు సేకరించడానికి గురువారం నిజామాబాద్‌కు బీసీ డెడికేటెడ్ కమిషన్ ప్రతినిధులు రానున్నారు. నిజామాబాద్ కలెక్టరేట్‌లో ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కమిషన్ సభ్యులు అందుబాటులో ఉంటారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లపై అభిప్రాయాలు, అభ్యర్థనలు, సలహాలు స్వీకరిస్తారు. ఈ విషయాన్ని బీసీ సంక్షేమ జిల్లా ఇన్‌చార్జి అధికారి చందర్‌నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బి.వెంకటేశ్వరరావు, కార్యదర్శి బి.సైదులు ప్రజాభిప్రాయాలు సేకరిస్తారని పేర్కొన్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన బీసీ కుల సంఘాలు, ఎన్జీవోలు, ప్రజా ప్రతినిధులు పాల్గొని అభిప్రాయాలు తెలియజేయాలని, తమ వాదనలకు మద్దతుగా ఆధారాలను సమర్పించాలని సూచించారు.

నేడు బీజేపీ బైక్ ర్యాలీ

కామారెడ్డి అర్బన్: బీజేపీ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించనున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఏడాది పాలన వైఫల్యాలపై బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ర్యాలీ ఉదయం 9.30 గంటలకు సీఎస్ఐ మైదానం నుంచి ప్రారంభమై పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా సాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజలను కోరారు.

న్యాస్ పరిశీలన



నాగిరెడ్డిపేట: మండలంలోని పలు పాఠశాలల్లో బుధవారం నిర్వహించిన నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే(న్యాస్)ను జిల్లా సెక్టోరల్ అధికారి వేణుశర్మ పరిశీలించారు. నాగిరెడ్డిపేట, జప్తిజాన్కంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలతోపాటు గోపాల్‌పేట మోడల్ స్కూల్, బొల్లారం హైస్కూల్‌లో విద్యార్థులకు న్యాస్ పరీక్ష నిర్వహించారు. పరీక్ష నిర్వాహణ తీరును జిల్లా సెక్టోరల్ అధికారి పరిశీలించారు. ఉపాధ్యాయులతోపాటు పరీక్ష నిర్వాహకులకు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట ఎంఈవో భాస్కర్‌రెడ్డి ఉన్నారు.

కౌన్సిలర్ పదవికి రాజీనామా



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి తాజా మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ మున్సిపల్ కౌన్సిలర్ పదవికి రాజీనామా చేశారు. బుధవారం ఆయన తన అనుచరులతో ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి ఆర్డీవో మన్నె ప్రభాకర్‌కు రాజీనామా లేఖను అందించారు. 2020లో ఎల్లారెడ్డి మున్సిపాలిటీ ఏడో వార్డు కౌన్సిలర్‌గా టీఆర్ఎస్ నుంచి గెలుపొందిన ఆయన.. ఎల్లారెడ్డి మున్సిపాలిటీ మొట్టమొదటి చైర్మన్‌గా నాలుగున్నరేళ్లపాటు కొనసాగారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం ఆయన కాంగ్రెస్‌లో చేరారు. దీంతో టీఆర్ఎస్ కౌన్సిలర్లు ఆయనపై అవిశ్వాస తీర్మానం పెట్టి చైర్మన్ పదవి నుంచి దింపేశారు. మున్సిపల్ చైర్మన్‌గా నాలుగున్నరేళ్లపాటు పట్టణ అభివృద్ధికి ఎంతో కృషి చేశానని సత్యనారాయణ పేర్కొన్నారు. వ్యక్తిగత కారణాలతో కౌన్సిలర్ పదవికి రాజీనామా చేస్తున్నానని తెలిపారు.

నమ్మకాన్ని వమ్ము చేయను

- ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తున్నా
- కబ్జాలు, సెటిల్‌మెంట్లు, దౌర్జన్యాలకు అడ్డుకట్ట వేశా
- రాష్ట్ర ప్రభుత్వం సహకరించకున్నా అభివృద్ధి చేస్తా
- ప్రధాని, కేంద్ర మంత్రులకు ప్రతిపాదనలు అందించా
- త్వరలోనే నియోజకవర్గానికి నిధులొస్తాయి
- 'సాక్షి' ఇంటర్వ్యూలో కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ''కబ్జాలు, సెటిల్‌మెంట్లు, దౌర్జన్యాలతో విసిగిపోయిన కామారెడ్డి నియోజకవర్గ ప్రజలు నన్ను నమ్మి ఎమ్మెల్యేగా గెలిపించారు. వాళ్ల నమ్మకాన్ని వమ్ము చేయను. ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తున్నా. అక్రమార్కులకు ఎప్పటికప్పుడు చెక్‌పెడుతుండడంతో కబ్జాలు ఆగాయి. దౌర్జన్యాలు లేవు. సెటిల్‌మెంట్లు బందయ్యాయి. పోలీసు కేసుల వేధింపులు లేవు. రాష్ట్ర ప్రభుత్వం సహకరించకున్నా నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నా. త్వరలోనే భారీగా కేంద్ర నిధులు వస్తాయి'' అని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికై ఏడాదవుతున్న సందర్భంగా 'సాక్షి' బుధవారం ఆయనను ఇంటర్వ్యూ చేసింది. ఆ వివరాలు..

స్మార్ట్ సిటీ కోసం ప్రయత్నిస్తున్నా..

కామారెడ్డిని స్మార్ట్ సిటీ జాబితాలో చేర్చాలని ప్రధాని మోదీని కోరా. రోడ్ల వెడల్పు, అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ నిర్మాణం, ఇండోర్ స్టేడియం, ఔట్‌డోర్ స్టేడియం, రింగ్‌రోడ్‌కు ప్రతిపాదనలు ఇచ్చా. కామారెడ్డి పట్టణంలో డెయిరీ, ఫిషరీస్, ఫారెస్ట్రీ వంటి కోర్సులున్నాయి. ఇక్కడ ఐఐఎం ఏర్పాటు చేయాలని ప్రధానిని కోరాను. సైనిక్ స్కూల్, కేంద్రీయ విద్యాలయాల కోసం కేంద్ర మంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, రాజ్‌నాథ్‌సింగ్‌లను కలిశా. ప్రధానితో పాటు కేంద్ర మంత్రులంతా కామారెడ్డి అభివృద్ధికి నిధులు ఇవ్వడానికి సుముఖంగా ఉన్నారు. నేనిచ్చిన అన్ని ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలించారు. త్వరలోనే ఒక్కొక్కటిగా అన్నీ మంజూరవుతాయని ఆశిస్తున్నా.

మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నా

నియోజకవర్గంలో 30 శాతం మంది పిల్లలు మాత్రమే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారు. 70 శాతం మంది ప్రైవేటు బడులకు వెళ్తున్నారు. వచ్చే విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వారి శాతం పెరిగేందుకు కృషి చేస్తున్నా. చాలా స్కూళ్లలో బెంచీలు, బ్లాక్‌బోర్డులు లేవు. టాయిలెట్స్ సమస్య ఉంది. నియోజకవర్గంలోని అన్ని పాఠశాలల్లో కలిపి 3 వేల బెంచీలు, 8 వందల ఫ్యాన్లు, 150 మినరల్ వాటర్ ప్లాంట్లు అవసరం ఉన్నాయి. స్వచ్ఛంద సంస్థలు, సామాజిక స్పృహ ఉన్న వ్యక్తులు, పూర్వ విద్యార్థుల సహకారంతో ఆయా సౌకర్యాలు కల్పించడానికి కృషి చేస్తున్నా.

ప్రతిపక్షాల హక్కులు హరిస్తున్నారు

ప్రజలు ఓట్లేసి నన్ను గెలిపించారు. అయితే ఇక్కడ పోటీ చేయకుండా పారిపోయిన వ్యక్తి అడ్డదారిలో అధికారం చెలాయిస్తూ ఎమ్మెల్యేగా నా హక్కులను కాలరాస్తున్నాడు. ఈజీఎస్ నిధులు రూ.5.50 కోట్లు, ఎస్‌డీఎఫ్ నిధులు రూ.10 కోట్లతో నేను పంపిన ప్రతిపాదనలను పక్కన పడేసి వాళ్ల ఇష్టం ఉన్నట్టుగా చేసుకుని, పాతవాటికి రికార్డు చేయించుకుని దుర్వినియోగానికి పాల్పడ్డారు. విజిలెన్స్ విచారణలో రూ.2.50 కోట్లు దుర్వినియోగం అయినట్టు తేలింది. అక్రమాలకు పాల్పడుతున్నవారే నేను అభివృద్ధికి అడ్డు పడుతున్నానని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు.

ప్రజల సహకారంతో రూపురేఖలు మారుస్తా

రాష్ట్ర ప్రభుత్వం సహకరించకపోయినా.. కేంద్రం నుంచి నిధులు తీసుకువచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తా. ఈ ప్రాంతానికి చెందిన వారెందరో ఉన్నత స్థానాల్లో ఉన్నారు. విదేశాల్లో సెటిల్ అయిన చాలామంది నాతో మాట్లాడుతున్నారు. అభివృద్ధికి సహకరిస్తామంటున్నారు. వారి సహకారంతో కామారెడ్డి రూపురేఖలు మారుస్తా. దసరా నుంచి కార్యాచరణ మొదలుపెడతా.

వైద్య సేవలు మెరుగుపడేందుకు..

ప్రైవేటులో వైద్యం కోసం రూ.లక్షలు పెట్టే పరిస్థితులు లేక పేదలు ఇబ్బందులు పడుతున్నారు. వారి కష్టాలను తప్పించడం కోసమే స్కూళ్లు, ఆస్పత్రులను తనిఖీలు చేస్తూ సమస్యలు తెలుసుకుంటున్నా. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో అనేక సమస్యలున్నాయి. డాక్టర్లు, సిబ్బంది, పేషెంట్లు ఇబ్బందులు పడుతుండడంతో సొంత డబ్బులు రూ.18 లక్షలు ఖర్చు చేసి బోరు వేయించి, మోటారు ఏర్పాటు చేయించా. షెడ్లు వేయించా. మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటు చేయించా. వైద్యులతో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరిస్తుండడంతో సేవలు మెరుగుపడుతున్నాయి.

సొంత ఎజెండానూ అమలు చేస్తా

ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సొంత ఎజెండాలో పొందుపరిచిన రూ.150 కోట్ల విలువైన పనులు చేసి తీరుతా. ఇప్పటికే రైతు కల్లాల కోసం రెడీమిక్స్ ప్లాంట్ ఏర్పాటు చేశా. పది పదిహేను రోజుల్లో కల్లాలు నిర్మించే పనులు మొదలుపెడతా. స్కూళ్లు, ఆస్పత్రుల నిర్మాణాలు, రైతు సేవా కేంద్రాల ఏర్పాటు వంటివి కూడా ఒక్కొక్కటిగా చేస్తా. కామారెడ్డికి నర్సింగ్ కాలేజీ తీసుకురాలేదని నన్ను అడుగుతున్నారు. మెడికల్ కాలేజీ ఉన్న చోట నర్సింగ్ కాలేజీ ఏర్పాటు చేయాల్సి ఉన్నా, అప్పటి ప్రభుత్వంలో స్పీకర్‌గా ఉన్న పోచారం శ్రీనివాస్ రెడ్డి ముందుగానే బాన్సువాడకు తరలించుకుపోయారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఎందుకు రాలేదో ఆరోపణలు చేసేవాళ్లే చెప్పాలి.

రైల్వే వంతెనలు నిర్మిస్తాం

కామారెడ్డి పట్టణంలో నాలుగు రైల్వే వంతెనల కోసం కేంద్రానికి ప్రతిపాదనలు అందించా. పాత రాజంపేట వద్ద రైల్వే బ్రిడ్జి, అశోక్‌నగర్ రైల్వే గేట్ వద్ద బ్రిడ్జి, వికాస్‌నగర్‌లో రైల్వే బ్రిడ్జి, కలెక్టరేట్ సమీపంలో రైల్వే బ్రిడ్జీలు నిర్మించాలని కోరా. ప్రియా టాకీస్ రోడ్డు నుంచి పాత బస్టాండ్ వెళ్లడానికి ఫుట్ ఓవర్ బ్రిడ్జికి ప్రతిపాదనలు ఇచ్చా. భిక్కనూరు, తలమడ్ల, రాజంపేట రోడ్డుకు సెంట్రల్ రోడ్ ఫండ్ నుంచి రూ. 25 కోట్లు మంజూరు చేయించా. మరికొన్ని రోడ్ల కోసం రూ.70 కోట్లతో ప్రతిపాదనలు పంపించా.

పార్టీ మారుతాననేది తప్పుడు ప్రచారం

నేను పార్టీ మారుతానంటూ స్థానికంగా అధికార పార్టీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. నాకు పార్టీ మారాల్సిన అవసరం లేదు. అభివృద్ధి కోసం ప్రభుత్వం మెడలు వంచుతానే తప్ప, నేను తలవంచను. అసెంబ్లీ వేదికగా నియోజకవర్గ సమస్యల విషయంలో ప్రభుత్వంపై పోరాడుతా. ఎమ్మెల్యేగా నాకున్న హక్కులకు భంగం కలిగిస్తున్న వారి వ్యవహారంపై ఈసారి అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీస్తా.

రాజకీయాల్లో మార్పు కోసమే తపన

నాకు ప్రచార యావ లేదు. 4 వందల ఎల్‌వోసీలు, 3 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు ఇచ్చినా ఎక్కడా ప్రచారం చేసుకోలేదు. రాజకీయాల్లో మార్పు రావాలన్నదే నా ధ్యేయం. అందుకోసమే ఎక్కడా పైరవీలకు తావులేకుండా చర్యలు తీసుకుంటున్నా. ప్రజలు నేరుగా నా కార్యాలయానికి వచ్చి వారి సమస్యలు చెప్పుకునే వీలు కల్పించా. రోజూ నా వద్దకు వందలాది మంది వస్తున్నారు. వాళ్ల సమస్యలను విని పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నా. అధికారులూ సహకరిస్తున్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి


చుక్కాపూర్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ సంగ్వాన్

మాచారెడ్డి: ప్రతి ఒక్కరు మొక్కలను నాటి సంరక్షించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలలో భాగంగా బుధవారం చుక్కాపూర్‌లో ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ ప్రాముఖ్యత గురించి విద్యార్థి దశలోనే తెలుసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి ఒక్కో మొక్కను నాటి సంరక్షించాలని సూచించారు. అడవిలో మంటలు చెలరేగకుండా చూసేందుకు సిబ్బంది పలు జాగ్రత్తలు తీసుకుంటున్నారని జిల్లా అటవీ అధికారి నిఖిత తెలిపారు. అడవుల ప్రాముఖ్యత, గ్రహాలు, జీవరాసులు అంశంపై కలెక్టర్ ప్రశ్నించగా.. విద్యార్థులు సరైన సమాధానాలు ఇవ్వడంతో ఆయన హర్షం వ్యక్తం చేశారు. వన్యప్రాణి దినోత్సవతంలో భాగంగా నిర్వహించిన వ్యాసరచన, పెయింటింగ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంస పత్రాలను అందించారు. అనంతరం ఎంపీడీవో కాంప్లెక్స్‌లోని శిథిల భవనాన్ని పరిశీలించారు. దాన్ని ఇందిరమ్మ మోడల్ హౌజ్‌గా మార్చాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు పక్క ఉన్న చెత్తాచెదారాన్ని చూసిన కలెక్టర్.. ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావుకు సూచించారు. ఆయన వెంట అటవీ రేంజ్ అధికారి దివ్య, తహసీల్దార్ శ్వేత, ఎంపీడీవో గోపిబాబు తదితరులున్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి


విద్యార్థులకు క్రీడా సామగ్రిని అందిస్తున్న కలెక్టర్ సంగ్వాన్

కామారెడ్డి రూరల్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆకాంక్షించారు. గర్గుల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన హాకీ క్రీడాకారులకు మన ఊరు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ. 25 వేల విలువచేసే క్రీడా సామగ్రిని బుధవారం అందించారు. కార్యక్రమంలో మన ఊరు ఫౌండేషన్ అధ్యక్షుడు సున్నపు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కొలిమి సురేశ్‌రెడ్డి, సలహాదారులు కొలిమి భీంరెడ్డి, రాజ్‌కుమార్‌రెడ్డి, ప్రభాకర్, డిస్ట్రిక్ట్ యూత్ అండ్ స్పోర్ట్స్ ఆఫీసర్ జగన్నాథం, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ నోముల మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యాయులు సామ్యూల్, సుగుణరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థినులకు వసతి కష్టాలు

40 మందికే హాస్టల్ సౌకర్యం
- మరో 22 మందికి సౌకర్యం కల్పించలేక చేతులెత్తేసిన అధికారులు
- ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులు



మెడికల్ కాలేజ్ వద్ద విద్యార్థినుల పేరెంట్స్

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : కామారెడ్డి ప్రభుత్వ మెడికల్ కాలేజీ విద్యార్థులు వసతి కష్టాలు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం ఉన్న హాస్టల్ భవనంలో గదులు సరిపోకపోవడంతో 22 మంది విద్యార్థులకు వసతి కల్పించలేమంటూ కళాశాల అధికారులు చేతులెత్తేశారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

మెడికల్ కాలేజీ హాస్టల్ అద్దె భవనంలో కొనసాగుతోంది. సెకండియర్ విద్యార్థినులు ఈ భవనంలో వసతి పొందుతున్నారు. కాగా ఈ ఏడాది ఎంబీబీఎస్ మొదటి సంవత్సరంలో 62 మంది విద్యార్థినులు కళాశాలలో చేరారు. అయితే 40 మందికి సరిపడా గదులు మాత్రమే ఉండడంతో మిగతా 22 మందికి వసతి కల్పించలేమంటూ కళాశాల అధికారులు చేతులెత్తేశారు. ఈ విషయాన్ని విద్యార్థుల పేరెంట్స్‌కు చెప్పడంతో వారు ఆందోళన చెందుతున్నారు. సమీపంలో వారికి ఉండడానికి సౌకర్యాలు లేవని, ఎక్కడ ఉండాలని, ఎలా చదువుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిగతా విద్యార్థినులతో కలిపి వసతి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

ప్రయత్నాలు చేస్తున్నాం

ప్రస్తుతం ఉన్న భవనం అందరికీ సరిపోవడం లేదు. అదనపు భవనాల కోసం వెతికాం. కానీ సౌకర్యాలున్న భవనాలు దొరకలేదు. పదిపదిహేను రోజుల్లో సర్దుబాటు చేసే ప్రయత్నం చేస్తున్నాం. పిల్లలకు ఇబ్బంది కలగకుండా చూస్తాం. – శివప్రసాద్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, ప్రభుత్వ వైద్య కళాశాల

హాస్టల్ సౌకర్యం కల్పించాలి



కాలేజీకి సమీపంలో ఎక్కడా ప్రైవేటు హాస్టళ్లు కూడా లేవు. రెండు, మూడు కిలోమీటర్ల దూరంలో ఉంటూ రోజూ కళాశాలకు వెళ్లి రావడం కష్టం. కనీసం కాలేజీకి రవాణా సౌకర్యం కూడా లేదు. అధికారులు చొరవ చూపి హాస్టల్ సౌకర్యం కల్పించాలి.
– వై.శ్రీరాములు, పేరెంట్, హైదరాబాద్

అధికారులు ఆలోచించాలి



హాస్టల్ లేకుంటే ఆడపిల్లలు ఎక్కడ ఉండాలి. కామారెడ్డిలో మాకు తెలిసిన వారెవరూ లేరు. దగ్గరలో ఉండడానికి ఇళ్లు కూడా దొరికే పరిస్థితి లేదు. అధికారులు ఆలోచించి సౌకర్యం కల్పించాలి. ప్రస్తుతం ఉన్న హాస్టల్‌లోనే అందరినీ సర్దుబాటు చేయాలి.
– ఖాజా మజారొద్దీన్, పేరెంట్, హైదరాబాద్

ఏర్పాట్లు చేయాలి



మెడిసిన్ చదివే పిల్లలు అందరూ ఒకే దగ్గర ఉంటే ఏ ఇబ్బందీ ఉండదు. కొందరికి హాస్టల్ సౌకర్యం కల్పించి, మరికొందరిని బయట ఉండమనడం సరికాదు. కొత్త బ్యాచ్ వస్తుందని తెలిసినా ఏర్పాట్లు చేయకపోవడం దారుణం. వెంటనే ఏర్పాట్లు చేయాలి.
– స్వామి, పేరెంట్, గజ్వేల్

హిందువులంతా ఏకం కావాలి

- హిందూ ఐక్య వేదిక పిలుపు
- బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులకు నిరసనగా ర్యాలీ

కామారెడ్డి అర్బన్: పార్టీలు, కులాలకు అతీతంగా హిందువులు ఏకం కాకపోతే దేశ విభజన నాటి పరిస్థితులు పునరావృతం అయ్యే ప్రమాదం ఉందని హిందూ ఐక్య వేదిక ప్రతినిధి శివకుమార్ హెచ్చరించారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా బుధవారం కామారెడ్డి పట్టణంలో హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. జేపీఎన్ విగ్రహం వద్ద ప్రారంభమైన ర్యాలీ ప్రధాన వీధుల గుండా కొత్తబస్టాండ్ వరకు సాగింది. ర్యాలీలో భక్తులు భజనలు చేస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో నిమగ్నమై ఉంటూ సేవా కార్యక్రమాలు చేస్తున్న ఇస్కాన్ ప్రతినిధులపై దాడులు చేయడం, కేసులు పెట్టడం, జైళ్లలో వేయడం బంగ్లా పాలకుల రాక్షసత్వానికి నిదర్శనమన్నారు. హిందువులు మేల్కొకపోతే భవిష్యత్తులో మరిన్ని దాడులు జరిగే అవకాశం ఉందన్నారు. అనంతరం ఐక్య వేదిక ప్రతినిధులు కలెక్టరేట్‌కు వెళ్లి వినతిపత్రం అందించారు. ర్యాలీలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార, నాయకులు మురళీధర్‌గౌడ్, నీలం చిన్నరాజులు, ఎల్లారెడ్డి, ఆకుల భరత్‌కుమార్, మున్సిపాలిటీలో బీజేపీ ఫ్లోర్ లీడర్ ఎం.శ్రీకాంత్, మాజీ ఎంపీ బీబీ పాటిల్, ఆర్ఎస్ఎస్, బజరంగ్‌దళ్ ప్రతినిధులు రాజు, వెంకటస్వామి, యజ్ఞం పవన్‌కుమార్ శర్మ, కృష్ణానందస్వామి తదితరులు పాల్గొన్నారు.


జిల్లాకేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ ఐక్య వేదిక ప్రతినిధులు


భజనలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్న ఇస్కాన్ ప్రతినిధులు

క్లుప్తంగా

జాతీయ స్థాయి పోటీలకు పేట్‌సంగెం విద్యార్థులు



గాంధారి(ఎల్లారెడ్డి): వాలీబాల్, కబడ్డీ జాతీయ స్థాయి పోటీలకు మండల పరిధిలోని జెడ్పీ ఉన్నత పాఠశాల పేట్‌సంగెం విద్యార్థులు ఎంపికై నట్లు పాఠశాల హెచ్‌ఎం కుమార స్వామి, పీఈటీ లక్ష్మణ్ తెలిపారు. అండర్–14 విభాగంలో బస్సీ అర్జున్(వాలీబాల్), భుక్యా అర్జున్(కబడ్డీ) పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ నెల 10న మహారాష్ట్రలోని అమరావతి, ఉత్తర్‌ప్రదేశ్‌లోని వారణాసిలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

'యువ వికాసం' వేడుకలకు తరలిన బస్సులు



కామారెడ్డి క్రైం: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా బుధవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జరిగిన 'యువ వికాసం' వేడుకలకు కామారెడ్డి నుంచి జిల్లా యంత్రాంగం పలు బస్సులను ఏర్పాటు చేసి యువకులు, విద్యార్థులు, ఉద్యోగులను తీసుకువెళ్లారు. ఈ బస్సులను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ జెండా ఊపి ప్రారంభించారు. అదనపు కలెక్టర్లు వి.విక్టర్, శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో రంగనాథ్ రావు, అధికారులు పాల్గొన్నారు.

మల్బరీ సాగు చేసే రైతులకు రాయితీ



కామారెడ్డి క్రైం: మల్బరీ సాగు చేసే రైతులకు ప్రభుత్వం విడుదల చేసే రాయితీ వివరాలను జిల్లా పట్టు పరిశ్రమ శాఖాధికారిణి జ్యోతి తెలిపారు. రెండు ఎకరాల వ్యవసాయ క్షేత్రంలో యూనిట్ ధర రూ.7.50 లక్షలతో మల్బరీ సాగు చేపట్టాలని చెప్పారు. జనరల్ రైతులకు 50 శాతం రాయితీ ద్వారా రూ.3.75 లక్షలు వస్తాయని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 65 శాతం రాయితీ ద్వారా రూ.4.87 లక్షలు వస్తాయని తెలిపారు. నర్సరీ యూనిట్ ధర రూ.1.50 లక్షలు ఉంటుందని తెలిపారు. జనరల్ రైతులకు రూ.75 వేలు, ఎస్సీ ఎస్టీ రైతులకు రూ.97,500 ఉంటుందని పేర్కొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



భిక్కనూరు: తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో మాదక ద్రవ్యాల నిర్మూలన సంస్థ ప్రచురించిన వాల్‌పోస్టర్లను ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుధాకర్‌గౌడ్ మాట్లాడుతూ.. సమాజాన్ని మాదక ద్రవ్యాల నుంచి రక్షించాలని పిలుపునిచ్చారు. వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరీ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు అంజయ్య, హరిత, ఏపీఆర్‌వో సరిత అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏడాదిలో రూ.830 కోట్ల ఆర్థిక సహాయం

- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు
- పలు మండలాల్లో చెక్కుల పంపిణీ

నిజాంసాగర్(జుక్కల్): ఏడాది కాలంలో రూ.830 కోట్ల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందించిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికి దక్కిందని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. బుధవారం జుక్కల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద జుక్కల్ మండలంలోని పలు గ్రామాల వారికి సీఎం సహయనిధి చెక్కులు, డబుల్‌బెడ్రూం ఇళ్ల చెక్కులను ఎమ్మెల్యే అందించి మాట్లాడారు. సీఎం, పేదలకు మరింత అండగా నిలుస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పాత్రు కిశోర్‌కుమార్, రమేష్‌దేశాయ్, సాయాగౌడ్ ఉన్నారు.

మైనార్టీ నాయకులతో సమీక్ష

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో మంగళవారం రాత్రి ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు మైనారిటీ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వారి సమస్యలను ఆడిగి తెలుసుకున్నారు. నాయకులు అడ్వొకేట్ రాంరెడ్డి, ఏఎంసీ చైర్మన్ మనోజ్ కుమార్, వైస్ చైర్మన్ కృష్ణా రెడ్డి పాల్గొన్నారు.

నూతన రేషన్ షాపు ప్రారంభం

పెద్దకొడప్‌గల్(జుక్కల్): పేదల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. కాస్లాబాద్‌లో పలువురికి డబుల్ బెడ్ రూం ఇళ్ల చెక్కులను ఆయన పంపిణీ చేశారు. అనంతరం పోచారం గ్రామంలో నూతన రేషన్ షాప్‌ను ప్రారంభించారు. తహసీల్దార్ దశరథ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మహేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



బిచ్కుందలో సాక్షి పేపర్‌ను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

జుక్కల్‌ను అభివృద్ధి బాటలో నడిపిస్తా

బిచ్కుంద(జుక్కల్): గత పాలకుల నిర్లక్ష్యంతో జుక్కల్ నియోజకవర్గం అన్ని రంగాల్లో వెనకబడిందని, ఇప్పుడు అన్ని విధాలుగా అభివృద్ధి బాటలో నడిపిస్తానని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. బుధవారం స్థానిక మార్కెట్ యార్డులో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు పంపిణీ చేసి మాట్లాడారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా మద్నూర్‌లో రూ. 305 కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూల్ వచ్చిందని, ఈ నెల 7న జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణరావు చేతుల మీదుగా శంకుస్థాపన ఉందని తెలిపారు. అలాగే మద్నూర్ నుంచి బోధన్ వరకు నాలుగు వరుసల రోడ్డుకు రూ. 682 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. బిచ్కుందలో ఔటర్ లింగ్‌రోడ్డుకు ప్రతిపాదనలు పంపామని, అసెంబ్లీ సమావేశాల అనంతరం బిచ్కుంద మున్సిపాలిటీగా, జుక్కల్ రెవెన్యూ డివిజన్‌గా ప్రకటన వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

అభివృద్ధికి సాక్ష్యం..

నేను చేసిన అభివృద్ధికి సాక్షి దినపత్రికలో వచ్చిన ఇంటర్వ్యూ నిలువెత్తు సాక్ష్యంగా ఉందని ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు అన్నారు. ఈ సందర్భంగా సాక్షి పత్రికలో వచ్చిన ఇంటర్వ్యూ కథనాన్ని ప్రజలకు చూయించారు. కార్యక్రమంలో పీసీసీ డెలిగెట్ విఠల్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ శంకర్ పటేల్, తహసీల్దార్ సురేష్, ఆర్‌ఐ రవిందర్, నేతలు గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

బాల శాస్త్రవేత్తలకు ఆహ్వానం

- రేపటి నుంచి బాన్సువాడలో జిల్లా స్థాయి ఇన్‌స్పైర్, సైన్స్ ఫెయిర్ ప్రదర్శనలు

బాన్సువాడ : విద్యార్థుల్లోని సృజనాత్మకత, ఆలోచనా శక్తిని వెలికితీసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైన్స్‌ఫెయిర్, ఇన్‌స్పైర్ కార్యక్రమాలను చేపడుతున్నాయి. ఇందులో భాగంగా ఈ నెల 6, 7వ తేదీల్లో జిల్లా స్థాయి వైజ్ఞానిక, సైన్స్‌ఫెయిర్ ప్రదర్శనలు నిర్వహించనున్నారు. వైజ్ఞానిక ప్రదర్శనలకు బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల వేదిక కానుంది. రెండు రోజుల పాటు వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మూడు రోజుల క్రితం బాన్సువాడలో ప్రధానోపాధ్యాయులకు, సబ్జెక్టు ఉపాధ్యాయులకు, ఉపాధ్యాయ సంఘాలతో సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల, కస్తూర్బా, గురుకుల, మోడల్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు రూపొందిన 400 పైగా ప్రాజెక్టులు ప్రదర్శించనున్నారు. ఇది వరకే జిల్లా వ్యాప్తంగా 78 ప్రాజెక్టులను ఇన్‌స్పైర్ ప్రదర్శనలను ఎంపిక చేశారు. వారికి ఒక్కో ప్రాజెక్టుకు రూ.10 వేల చొప్పున పాఠశాల ప్రధానోపాధ్యాయుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. జిల్లాకు 78 ప్రాజెక్టులకు గాను రూ.7.80 లక్షలు వచ్చాయని జిల్లా సైన్స్ అధికారి సిద్దిరామిరెడ్డి తెలిపారు. జిల్లాలో స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయనున్నారు. వైజ్ఞానిక ప్రదర్శనల ఏర్పాట్లు విద్యా శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి.



సన్నాహక సమావేశంలో పాల్గొన్న ప్రధానోపాధ్యాయులు

సైబర్ నేరాలపై అవగాహన



అవగాహన ఫ్లెక్సీని ప్రదర్శిస్తున్న అధికారులు

కామారెడ్డి అర్బన్: సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ప్రతి కుటుంబంలో సైబర్‌నేరాల తీరుపై చర్చించాలని, సైబర్ నేరంగా అనుమానిస్తే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్‌చేసి వివరాలు తెలియజేయాలని సైబర్ క్రైమ్ విభాగం జిల్లా అధికారులు సూచించారు. ప్రతీ నెలా మొదటి బుధవారం సైబర్ జాగరుకత దివాస్ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థలో సైబర్ క్రైమ్ అవేర్‌నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. సైబర్ నేరాలపై 87126 72222 వాట్సప్ నంబర్‌కు సమాచారం ఇవ్వవచ్చన్నారు. పలు మోసాల గురించి వివరించారు. సిబ్బంది ప్రవీణ్, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఏఎస్సై ఉమేశ్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నాగిరెడ్డిపేట ఏఎస్సై ఉమేశ్ సూచించారు. గోపాల్‌పేటలో సైబర్ నేరాలపై బుధవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్‌చేసి బ్యాంకు ఖాతా వివరాలు అడిగితే చెప్పకూడదన్నారు. దీంతోపాటు ఆన్‌లైన్‌లో లింక్‌లను ఓపెన్ చేయవద్దన్నారు. ఖాతా నుంచి డబ్బులు మాయమైతే వెంటనే తమకు ఫిర్యాదు చేయాలని చెప్పారు. కానిస్టేబుళ్లు గోవర్ధన్, అర్చన, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతో రాణించాలి



దోమకొండ: దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో రాణించాలని ఎంఈవో విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని శివరాంమందిర్ పాఠశాలలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు పన్యాల నివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు ప్రభావతి, సంతోష్ కుమార్, నాగరాజు, విలీన విద్యా బోధకులు దామోదర్, రాజశేఖర్, దినేష్, విమల, విశాల, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ చిన్నారులకు క్రీడాపోటీలు



చిన్నారులకు నిర్వహిస్తున్న మ్యూజికల్ చైర్ పోటీలు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నాగిరెడ్డిపేట మండల విద్యావనరుల కేంద్రం వద్ద బుధవారం దివ్యాంగ చిన్నారులకు క్రీడాపోటీలను నిర్వహించారు. దీంతోపాటు వారితో వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలను జరిపారు. ఈ సందర్భంగా నాగిరెడ్డిపేట ఎంఈవో భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. దివ్యాంగ చిన్నారులు ఆత్మవిశ్వాసంతో ముందుకుసాగుతూ అన్నిరంగాలలో రాణించాలన్నారు. ప్రభుత్వం దివ్యాంగులకు అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరాలన్నారు. గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. స్పెషల్ ఎడ్యుకేటర్ సంతోష్, ఐఈఆర్‌పీలు సుజాత, సుష్మిత, సీఆర్‌పీలు రాజయ్య, కృష్ణస్వామి, సీవో శైలేంద్ర, పీటీఐ శంకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈవో భాస్కర్‌రెడ్డి

కానిస్టేబుల్‌కు డాక్టరేట్



కామారెడ్డి అర్బన్: ట్రాన్స్‌కో విజిలెన్స్ విభాగంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న అశోక్ నగర్‌కు చెందిన పుట్ల అనిల్‌కుమార్‌కు రాజస్థాన్ మాధవ్ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. జంతుశాస్త్రంలో 'స్టడీస్ ఆన్ సీజనల్ లిమ్నోలాజికల్ పారామీటర్స్ అండ్ ప్లాంక్టోనిక్ స్టడీ ఆన్ అర్బన్ అండ్ రూరల్ ఆఫ్ కామారెడ్డి డిస్ట్రిక్ట్' అనే అంశంపై అనిల్‌కుమార్ పరిశోధన చేశారు. డీజీపీ జితేందర్‌ను అనిల్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలువగా ఆయన అభినందించారు. కామారెడ్డి రక్తదాతల సమూహం ఉపాధ్యక్షుడిగా అనిల్‌కుమార్ సేవలందిస్తూ ఇప్పటి వరకు 25 సార్లు రక్తదానం చేశారు.

సీఎం కప్ పోటీలను పకడ్బందీగా నిర్వహించాలి



ఎల్లారెడ్డిలో మాట్లాడుతున్న ఆర్డీవో ప్రభాకర్



నాగిరెడ్డిపేటలో.. ఎంపీడీవో ప్రభాకరచారి

ఎల్లారెడ్డి/నాగిరెడ్డిపేట/తాడ్వాయిల: సీఎం కప్ ఆటల పోటీలను పకడ్బందీగా నిర్వహించాలని ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్, నాగిరెడ్డిపేట ఎంపీడీవో ప్రభాకరచారి, తాడ్వాయి ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ వేర్వేరుగా సూచించారు. ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట, తాడ్వాయిల పరిధిలో ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, పంచాయతీ సెక్రటరీలు, మండల స్థాయి అధికారులతో ఆటల పోటీల విషయమై వారు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ నెల 7, 8 తేదీల్లో గ్రామస్థాయిలో, 10 నుంచి 12 వరకు మండల స్థాయిలో ఈ పోటీలు ఉంటాయన్నారు. 18 సంవత్సరాల లోపు బాలబాలికలు వాలీబాల్ పోటీలకు, అథ్లెటిక్స్ విభాగంలో సబ్ జూనియర్ విభాగం పోటీలకు 14 ఏళ్లు, జూనియర్ విభాగం పోటీలకు 14 నుంచి 20 సంవత్సరాల లోపు బాలబాలికలు, యువకులు దరఖాస్తుల చేసుకోవచ్చన్నారు. ఖోఖో, కబడ్డీ పోటీలకు వయోపరిమితి లేదని వివరించారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ దరఖాస్తులను మొబైల్ నుంచి కూడా దరఖాస్తు చేసుకోవచ్చని వారు వివరించారు.



తాడ్వాయిలో..ఎంపీడీవో సాజిద్ అలీ

శభాష్ భారతి !



బస్సు టైరు మార్చడానికి సహకరిస్తున్న కండక్టర్ భారతి

బస్సు టైర్ పంక్చర్ అయి దాన్ని మార్చేందుకు డ్రైవర్ కష్టపడుతుండగా ఆయనకు మహిళా కండక్టర్‌తో పాటు విద్యార్థులు ఆసరా అయ్యారు. మహిళా కండక్టర్ పానా పట్టుకున్నపుడు ప్రయాణికులు ఫొటో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడంతో అందరూ ఆమెను అభినందించారు. కామారెడ్డి ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న సీహెచ్ భారతి రోజులాగే బుధవారం ఉదయం డ్యూటీకి వెళ్లింది. రాజంపేట మండలం ఆరేపల్లి, తలమడ్ల గ్రామాల నుంచి విద్యార్థులు, ప్రయాణికులను తీసుకుని వస్తుండగా, పొందుర్తి శివారులో బస్సు టైర్ పంక్చర్ అయ్యింది. దీంతో డ్రైవర్ టైరు ఇప్పేందుకు ప్రయత్నించగా, కండక్టర్ భారతి కూడా ఆయనకు సహకరించింది. దీంతో టైరు మార్చి బస్సును ముందుకు తీసుకువెళ్లారు. కాగా భారతి ఫొటో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది.

–సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

బస్సులు రాక .. కాలినడకన..

బాన్సువాడ : బాన్సువాడ –బీర్కూర్ మార్గంలో ఆర్టీసీ బస్సులు సమయానికి రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటు బాన్సువాడ కళాశాలలకు, అటు బీర్కూర్‌లో పాఠశాలలు, కళాశాలకు వెళ్లి చదువుకునే విద్యార్థులు రోజూ పాట్లు పడాల్సి వస్తోంది. బీర్కూర్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు మండలంలోని బరంగెడ్గి, సంబాపూర్, కిష్టాపూర్, చించొల్లి, అన్నారం, దామరంచ, రైతునగర్ గ్రామాల నుంచి విద్యార్థులు ప్రతి రోజూ వెళ్తుంటారు. బాన్సువాడలో ఉన్న కళాశాలలకు దామరంచ, కిష్టాపూర్, కొల్లూర్, నాగారం గ్రామాల చెందిన విద్యార్థులు వస్తుంటారు. బాన్సువాడ–బీర్కూర్ మార్గంలో ఒకే బస్సు నడపుతున్నారు. అదే బస్సు బాన్సువాడకు వచ్చి బీర్కూర్‌కు వెళ్లే సరికి రెండు గంటల సమయం పడుతోంది. దీంతో ఆయా మార్గాలలో మండల కేంద్రాలకు వెళ్లి విద్యనభ్యసించే విద్యార్థులు సమయానికి పాఠశాలలకు చేరుకోలేకపోతున్నారు. బస్సులు లేక కొందరు నడుచుకుంటూ వెళ్తూ అలిసిపోతున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి బాన్సువాడ–బీర్కూర్ మార్గంలో అదనంగా బస్సులు వేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



కిష్టాపూర్ నుంచి బీర్కూర్‌కు నడుచుకుంటూ వెళ్తున్న విద్యార్థినులు

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో ఫార్మసిస్ట్ మృతి

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రానికి చెందిన ఓ ఫార్మసిస్ట్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రంలోని భూపుత్రమ్మ కల్యాణ మండపం ఆవరణలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. బీడీ వర్కర్స్ కాలనీకి చెందిన శిరీష (28) బీఫార్మసీ పూర్తి చేసి కాంట్రాక్ట్ ప్రాతిపదికన జిల్లా వైద్యారోగ్య శాఖ పరిధిలోని ఆర్‌బీఎస్‌కే విభాగంలో ఫార్మసిస్ట్‌గా కొంతకాలంగా బిచ్కుందలో పనిచేస్తోంది. ఆమె భర్త స్వామి బతుకు తెరువు కోసం కొద్ది రోజుల క్రితం దుబాయికి వెళ్లగా, మామ పోచయ్య, అత్త సుగుణ భూపుత్రమ్మ కల్యాణ మండపంలో వాచ్‌మెన్‌లుగా పనిచేస్తున్నారు. వారికి అక్కడే కేటాయించిన ఓ గదిలో అందరూ కలిసి ఉంటున్నారు. గత కొంతకాలంగా ఆమెను కొందరు వ్యక్తులు వేధింపులకు గురి చేస్తున్నట్లు తెలిసింది. ఉద్యోగానికి సంబంధించిన విషయంలో వేధింపులు ఎదురవుతున్నాయని, ఉన్నతాధికారుల దృష్టికి సైతం ఈ విషయాన్ని తీసుకువెళ్లినట్లు సమాచారం. బుధవారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లో నిర్వహించిన శాఖపరమైన సమావేశానికి కూడా శిరీష హాజరైంది. సాయంత్రం ఇంటికి వచ్చిన ఆమె రాత్రి 7 గంటల ప్రాంతంలో ఇంటికి పక్కనే ఉన్న ఓ చిన్న షెడ్డులో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు గమనించారు. ఘటనా స్థలాన్ని పట్టణ పోలీసులు పరిశీలించి విచారణ చేపట్టారు. మృతురాలికి ఐదేళ్ల లోపు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆమె ఆత్మహత్య చేసుకుందా? లేక ఎవరైనా హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కారణాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై పట్టణ పోలీసులు విచారణ జరుపుతున్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



కామారెడ్డి రూరల్: కామారెడ్డి పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీలో నివాసముంటున్న రేవూరి ప్రభాకర్ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 3.80 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా సివిల్ సప్లయీస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ కిష్టయ్య బుధవారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఇంట్లో తనిఖీలు నిర్వహించామని, బియ్యం నిల్వ చేసిన ప్రభాకర్‌పై 6ఏ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. రేషన్ బయ్యాన్ని విక్రయించినా, కొనుగోలు చేసినా చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

యువతి అదృశ్యం

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలోని మాచాపూర్‌కు చెందిన యువతి(23) కనిపించడం లేదని ఫిర్యాదు అందినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. కామారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పని చేస్తున్న యువతికి రెండు నెలల క్రితం నాగిరెడ్డిపేట మండలానికి చెందిన యువకుడితో నిశ్చితార్థం జరిగిందన్నారు. ఈ నెల 2వ తేదీన పెళ్లి బట్టలు కొనుక్కుని వస్తానని ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి

ఎల్లారెడ్డి : వెల్లుట్ల తండాకు చెందిన జాత్రోత్ సావిత్రి అనే మహిళా రైతుకు చెందిన ఆవు విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మంగళవారం రాత్రి ప్రమాదవశాత్తు పొలాల వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో ఆవు మృతి చెందిందన్నారు. రూ.60వేల నష్టం వాటిల్లిందని గ్రామస్తులు తెలిపారు.

వేర్వేరు కేసుల్లో పలువురికి జైలుశిక్ష

హోటల్ యాజమానికి ఒక రోజు..

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా రాత్రివేళలో హోటల్ తెరిచి ఉంచిన వ్యక్తికి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి బుధవారం తెలిపారు. ఈనెల 2న షేక్ గౌస్‌పాషా అనే వ్యక్తి రాత్రి 10:30 గంటల తర్వాత హోటల్ తెరిచి ఉంచడంతో కేసు నమోదు చేసి కోర్టులో హాజర పర్చామన్నారు.

అంబులెన్స్ డ్రైవర్‌కి మూడు రోజులు..

మద్యం మత్తులో అంబులెన్స్ నడుపుతూ పట్టుబడిన డ్రైవర్‌కు న్యాయస్థానం మూడు రోజుల జైలుశిక్ష విధించినట్లు ట్రాఫిక్ సీఐ ప్రసాద్ తెలిపారు. ఈనెల 2వ తేదీన వాహనాలు తనిఖీ చేస్తుండగా, అంబులెన్స్‌ను డ్రైవర్ మహ్మద్ ఇసాక్ సైరన్ వేసుకుని అతివేగంగా నడిపాడన్నారు. తాము వెంబడించి అంబులెన్స్‌ను ఆపగా అందులో పేషెంట్ లేరని, డ్రైవర్‌కు బ్రీత్ అనలైజర్‌తో చెక్ చేయగా మద్యం సేవించినట్లు నిర్ధారణ అయ్యిందన్నారు. అంబులెన్స్‌ను సీజ్‌చేసి డ్రైవర్‌ను కోర్టులో హాజర్చగా న్యాయమూర్తి మూడు రోజుల జైలు శిక్ష విధించారన్నారు. అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన మరో 14 మందికి రూ.38వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

మద్యం మత్తులో న్యూసెన్స్ చేసిన వ్యక్తికి ఏడు రోజులు..

మద్యం మత్తులో న్యూసెన్స్ చేసిన నగరంలోని నాల్గో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బోర్గాంకు చెందిన సాంగి శ్రీధర్ (25)కు న్యాయస్థానం ఏడు రోజుల జైలుశిక్ష విధించినట్లు ఎస్సై శ్రీకాంత్ బుధవారం తెలిపారు. శ్రీధర్ మద్యం సేవించి కొన్ని రోజులుగా చుట్టుపక్కల వారితోపాటు కుటుంబ సభ్యులకు ఇబ్బంది కలిగిస్తుండడంతో కేసు నమోదు చేసి, కోర్టులో హాజర్చగా న్యాయమూర్తి జైలు శిక్ష విధించారన్నారు.

దొంగతనం కేసులో ఒకరికి..

జక్రాన్‌పల్లి: మండలంలోని వివేక్‌నగర్ తండాలో ఆగస్టులో బదావత్ నరేశ్ అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగింది. ఈ కేసులో పడకల్ గ్రామానికి చెందిన కోనేటి నరేశ్ అనే వ్యక్తికి ఆర్మూర్ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి వేముల దీప్తి ఆరు నెలల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.